# ప్రభాత ఉదయం

తెలుగు దినపత్రిక

సంపుటి: 2 | సంచిక: 74 | పేజీలు: 4 | వెల: రూ.3/- | సోమవారం 24 జూన్ 2024 | ఎడిటర్: కోట్ల చంద్రకాంత్




## బెయిల్ నిలిపివేతపై.. సుప్రీం కోర్టుకు కేజ్రీవాల్

న్యూఢిల్లీ, జూన్ 23 (ప్రభాత ఉదయం): మద్యం విధానానికి సంబంధించిన మనీలాండరింగ్ కేసులో ఢిల్లీ సీఎం, ఆప్ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్‌కు రెగ్యులర్ బెయిల్ మంజూరు చేస్తూ ట్రయల్ కోర్టు ఇచ్చిన ఉత్తర్వులను ఢిల్లీ హైకోర్టు నిలిపివేసిన విషయం ..మిగతా 2లో

# నేషనల్ హైవేపై ఫ్లైఓవర్ నిర్మాణం

### ఈ ప్రాంతాల వారికి మహర్దశ

హైదరాబాద్, జూన్ 23 (ప్రభాత ఉదయం): రెండు తెలుగు రాష్ట్రాలను కలిపే వారధి హైదరాబాద్- విజయవాడ జాతీయ రహదారి. ఎన్‌హెచ్ 65గా పిలవబడే ఈ రహదారి దేశంలోని అత్యంత వాహనాల రద్దీ కలిగి ఉంది. ఈ హైవేపై జరుగుతున్న రోడ్డు ప్రమాదాలకు చెక్ పెట్టేందుకు నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా నడుం బిగించింది. తరుచూ ప్రమాదాలు జరిగే ప్రాంతాల్లో ఫ్లై ఓవర్ బ్రిడ్జిలను నిర్మించాలని సంకల్పించింది. డెత్ రోడ్డుగా పిలిచే ఈ హైవే మచిలీపట్నం-పూణేతో కలుపుతుంది. ఎన్‌హెచ్ 65లో భాగంగా ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 15మండలాల్లో 33 గ్రామాల మీదుగా 181 కిలోమీటర్ల ఈ రహదారి వెళుతోంది. ఈ హైవేను 2015లో జీఎంఆర్ సంస్థ నాలుగు లైన్లుగా అభివృద్ధి చేసింది. కేవలం అక్కడక్కడ మాత్రమే అండర్ పాస్‌లు, సర్వీస్ రోడ్లను మాత్రమే జీఎంఆర్ సంస్థ నిర్మించింది. కొన్ని గ్రామాల్లో రోడ్డును ఎత్తుగా నిర్మించారు. ఈ హైవేకు ఇరువైపుల 33 గ్రామాలు ఉండగా, కేవలం 20 గ్రామాల్లో మాత్రమే సర్వీస్ రోడ్డు నిర్మించారు. కొన్నిచోట్ల బైపాస్ రోడ్లకు లింకు రోడ్లను కూడా ఏర్పాటు చేయలేదు.

**నాలుగు లైన్లుగా మారి దశాబ్దం దాటినా ఆగని ప్రమాదాలు..**

హైదరాబాద్ విజయవాడ జాతీయ రహదారిని నాలుగు లైన్లుగా విస్తరించి దశాబ్దం దాటినా ఇంకా ప్రమాదాలకు తగ్గడం లేదు. నిత్యం రక్తసిక్తమవుతోంది. నిత్యం ..మిగతా 2లో





## నీట్ పరీక్షలపై స్పందించిన ఐఎంఎ

### పీఎం మోదీ, కేంద్ర మంత్రులకు బహిరంగ లేఖ

న్యూఢిల్లీ, జూన్ 23 (ప్రభాత ఉదయం): ప్రధాన మంత్రి నరేంద్ర మోదీని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ అభినందించింది. నీట్ పరీక్షలు రద్దు చేసి తిరిగి నిర్వహించినందుకు దేశ ప్రధానితో సహా కేంద్ర మంత్రుల బృందానికి కృతజతలు తెలిపింది. దేశంలో తలెత్తిన నీట్ అండర్ గ్రాడ్యుయేషన్ పరీక్ష వివాదంపై సత్వరమే స్పందించి ఆ సమస్యను పరిష్కరించినందుకు ధన్యావాదాలు తెలిపింది. అందుకు సంబంధిత శాఖ మంత్రి ధర్మేంద్రప్రధాన్‌ను కూడా ఐఎంఎ అభినందించింది. నీట్ పరీక్షకు సంబంధించిన వివాదాన్ని తీవ్రతరం కాకుండా, ఆందోళనలను విరమించేందుకు దోహదపడే నిర్ణయాలు తీసుకున్నాందుకు ఒక లేఖలే సందేశాన్ని పంపించింది. అందులో కొన్ని కీలక విషయాలను పొందుపరిచింది. నీట్ పరీక్షల్లో జరిగిన అక్రమాలపై సమగ్ర దర్యాప్తు కోరుతూ సీబీఐని ఆదేశించినందుకు కేంద్ర విద్యాశాఖ మంత్రిత్వ శాఖకు కృతజతలు తెలిపింది. ఇప్పటికే పాత NTA డైరెక్టర్ జనరల్‌ను తొలగించి, కొత్త డైరెక్టర్ జనరల్‌గా శ్రీ ప్రదీప్ కుమార్ ఖరోకాకు అదనపు బాధ్యతను అప్పగించినందుకు కేంద్ర ప్రభుత్వాన్ని అభినందించింది. పోటీ పరీక్షల్లో అక్రమాలకు తావులేకుండా కేంద్ర ప్రభుత్వం స్పందించిన తీరును ఇండియన్ మెడికల్ అసోసియేషన్ కొనియాడింది. అందుకు సంబంధించిన చట్టాలు కూడా కఠినతరం చేయాలని కోరింది. ఇలాంటి పోటీ పరీక్షల్లో అక్రమాలకు పాల్పడి నేరస్తులుగా రుజువైతే గరిష్ఠంగా 10 సంవత్సరాల జైలు శిక్ష, కనీసం రూ. 1 కోటి జరిమాన విధించాలని సూచించింది. ప్రస్తుత విద్యార్థుల భారతదేశ భవిష్యత్తును పరిగణలోకి తీసుకుని ముఖ్యమైన పోటీ పరీక్షలను అత్యంత శ్రద్ధతో, గోప్యతతో నిర్వహించడం చాలా కీలకమని పేర్కొంది. IMA ప్రభుత్వ నిర్ణయాలను స్వాగతించడమే కాకుండా, సమయానుకూలమైన వాటిపై తీసుకునే గొప్ప నిర్ణయాలను అభినందిస్తుందని ఈ లేఖలో పేర్కొంది. మెడికల్, డెంటల్ కోర్సులతో పాటు ఇతర కోర్సులలో ప్రవేశానికి కౌన్సెలింగ్ సకాలంలో ప్రారంభమయ్యేలా ప్రభుత్వం త్వరితగతిన చర్యలు తీసుకోవాలని తాము కోరుతున్నట్లు ఈ లేఖలో పొందుపరిచింది.

## రైతుని రాజు చేయాలన్నదే మా ఆశయం



ఖమ్మం జిల్లా జూన్ 23 ప్రభాత ఉదయం): ఖమ్మం రూరల్ మండలం ఆరెంపల గ్రామంలో పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మీరు ఎంతయితే ఆనందంతో పాలాభిషేకం చేశారన్నారు. గత ప్రభుత్వములో లాగా పది సంవత్సరాలు రుణమాఫీ ఇచ్చేయకుండా మాయ మాటలు చెప్పి గడిపిన నట్లుగా మా ప్రభుత్వం ఉండదని, ముఖ్యమంత్రి క్యాబినెట్ సమక్షంలో ఒకేసారి రెండు లక్షల రుణమాఫీ చేస్తామని నిర్ణయం తీసుకున్నామన్నారు. తెలంగాణ ప్రభుత్వంలో రైతుని రాజు చేయాలన్నదే మా ఆశయమని, నిబద్ధత గల ప్రభుత్వం పేదోడి ప్రభుత్వం ప్రజలు కోరుకునే ప్రభుత్వం ..మిగతా 2లో

## సీఎం రేవంత్ రెడ్డి ఢిల్లీ పర్యటన

### ఆశావాహుల్లో కొత్త ఆశలు

హైదరాబాద్, జూన్ 23 (ప్రభాత ఉదయం): సోమవారం నుంచి పార్లమెంట్ సమావేశాలు జరగనున్న నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేడు ఢిల్లీలో పర్యటించనున్నారు. మొదటి రెండు రోజులు కొత్తగా ఎంపికైన లోక్ సభ సభ్యుల ప్రమాణ స్వీకారం కొనసాగనున్నది. ఈ కార్యక్రమానికి సీఎం హాజరు కానున్న తెలుస్తోంది. ఈ సందర్భంగా ఢిల్లీలో తెలంగాణ కాంగ్రెస్ ఎంపీలతో రేవంత్ రెడ్డి సమావేశం కానున్నారు. ఈ పర్యటనలో భాగంగా సీఎం పలువురు కేంద్ర మంత్రులతో భేటీ అయి రాష్ట్రాభివృద్ధిపై చర్చించి పలు సమస్యలపై వినతి పత్రాలు ఇచ్చే అవకాశం ఉంది. అలాగే ఏఐసీసీ పెద్దలతోనూ క్యాబినెట్ విస్తరణ, కొత్త పీసీసీ అధ్యక్షుడి ఎంపికపై, నామినేటెడ్ పదవుల భర్తీ విషయాలపై చర్చించనున్నట్టు తెలుస్తోంది. రేవంత్ రెడ్డి ఢిల్లీ పర్యటన నేపథ్యంలో పార్టీలో పదవులు ఆశిస్తున్న ఆశావాహుల్లో కొత్త ఆశలు చిగురిస్తున్నాయి.





## బీఎస్పీ ఛీఫ్ కీలక నిర్ణయం

### వారసుడిని ప్రకటించిన మాయావతి

లక్నో, జూన్ 23 (ప్రభాత ఉదయం): లోక్‌సభ ఎన్నికల్లో ఘోర ఓటమి తరువాత బీఎస్పీ చీఫ్ మాయావతి కీలక నిర్ణయం తీసుకున్నారు. తన వారసుడిగా మేనల్లుడు ఆకాశ్ ఆనంద్‌ను ప్రకటించారు. అంతేకాకుండా పార్టీ జాతీయ కన్వీనర్‌గా కూడా నియమించారు. లోక్‌సభ ఎన్నికల్లో ఒక్క సీటు కూడా దక్కలేదు. పార్టీ భవితవ్యంపై నీలినీడలు కమ్ముకున్న వేళ బీఎస్పీ సుప్రీం లీడర్ మాయావతి కీలక నిర్ణయం తీసుకున్నారు. తన మేనల్లుడు ఆకాశ్ ఆనంద్‌ను రాజకీయ వారసుడిగా ప్రకటించారు. అంతేకాకుండా ఆకాశ్ ఆనంద్‌ను బీఎస్పీ ..మిగతా 2లో



## దంచికొట్టిన వర్షం

### మరో రెండు రోజులు రెయిన్ అలెర్ట్

హైదరాబాద్, జూన్ 23 (ప్రభాత ఉదయం): ఉపరితల ఆవర్తనం ప్రభావంతో హైదరాబాద్‌లో భారీ వర్షం కురిసింది. దీంతో ప్రధాన రహదారులు జలమయమయ్యాయి. జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, ఫిలింనగర్, పంజాగుట్ట, ఖైరతాబాద్, అమీర్‌పేట్, మియాపూర్, చందానగర్, శేరిలింగంపల్లి, మాదాపూర్, గచ్చిబౌలి, మణికొండ, టోలిచౌకి ప్రాంతాల్లో కుండపోత వర్షం పడింది. ఒక్కసారిగా భారీ వర్షం కురవడంతో పలుచోట్ల ట్రాఫిక్ స్తంభించింది. రోడ్లపై నీళ్లు నిలవడంతో వాహనదారులు ఇబ్బందులకు గురయ్యారు. నీటిని క్లియర్ చేయడానికి జీహెచ్ఎంసీ, DRF బృందాలు రంగంలో దిగాయి. ఇటు ఖమ్మం జిల్లా సత్తుపల్లిలో వర్షం కారణంగా సింగరేణి ఓపెన్ కాస్ట్ గనుల్లో 15 వేల టన్నుల బొగ్గు ఉత్పత్తి కి ఆటంకం ఏర్పడింది. అదే విధంగా 90 వేల క్యూబిక్ మీటర్ల ఉపరితల మట్టి తొలగింపు పనులు నిలిచిపోయినట్టు సింగరేణి అధికారులు ప్రకటించారు. పెనుబల్లి, సత్తుపల్లి, కల్లూరు మండలాల్లో అధిక వర్షపాతం నమోదైంది. సోమ, మంగళవారాల్లో కూడా తెలంగాణలో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచనా వేసింది. హైదరాబాద్‌తో పాటు జిల్లాల్లో ఈదురుగాలులతో కూడిన వర్షాలు పడే ఛాన్స్ ఉందన్నారు. మరోవైపు ఆంధ్రప్రదేశ్‌లోని పలు జిల్లాల్లో రేపు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని.. మంగళ, బుధవారాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణ అధికారులు ప్రకటించారు. లోతట్టు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వర్షాలతో పాటు పిడుగులు పడే అవకాశం ఉందని.. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డిజాస్టర్ మేనేజ్‌మెంట్ హెచ్చరించింది.

## నేడు ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల ఫలితాలు



హైదరాబాద్, జూన్ 23 (ప్రభాత ఉదయం): తెలంగాణలో ఇంటర్మీడియట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల ఫలితాలు నేడు విడుదల కానున్నాయి. ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ ఫలితాలకు సంబంధించి బోర్డు అధికారులు కసరత్తు పూర్తి చేశారు. ఇప్పటికే మూల్యాంకాన ప్రక్రియ పూర్తయ్యింది. సాంకేతికపరమైన అంశాలను పరిశీలన సైతం పూర్తవ్వడంతో సోమవారం మధ్యహ్నం 2గంటలకు విడుదల చేయనున్నట్లు ఇంటర్ బోర్డు ప్రకటించింది. అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షకు దాదాపు దాదాపు నాలుగున్నర లక్షల మంది విద్యార్థులు హాజరైనట్లు సమాచారం. వీరిలో పరీక్షల్లో ఫెయిలైనవారితో పాటు ఫస్టియర్‌లో ఇంప్రూవ్‌మెంట్ కోసం రాసిన విద్యార్థులూ ఉన్నారు. కాగా.. తెలంగాణ రాష్ట్రంలో మే 24 నుంచి జూన్ 3వ తేదీ వరకు ఈ పరీక్షలు జరిగిన విషయం తెలిసిందే. ఆయా తేదీల్లో ఉదయం 9 నుంచి 12 వరకు ఇంటర్ ఫస్టియర్ పరీక్షలు.. మధ్యాహ్నం 2.30 నుంచి 5.30 వరకు సెకండియర్ పరీక్షలు నిర్వహించారు. అలాగే.. జూన్ 4 నుంచి 8వ తేదీ వరకు ఉదయం 9 నుంచి 12 వరకు, మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహించారు.

# శ్రీ వీరభద్ర స్వామీ దేవాలయ ద్వితీయ వార్షికోత్సవం



శ్రీ వీరభద్ర స్వామీని దర్శించుకుంటున్న భక్తులు



అన్న దానంలో పాల్గొన్న బస్తీ పెద్దలు, దేవాలయ కమిటీ సభ్యులు

## బుద్వేల్ బస్ స్టాప్‌లో సంబరంగా వేడుకలు

బుద్వేల్, జూన్23(ప్రభాత ఉదయం): రాజేంద్రనగర్ సర్కిల్ బుద్వేల్ ప్రధాన రహదారిపై గల శ్రీ వీరభద్ర స్వామి దేవాలయం పునర్నిర్మాణం జరిగి రెండు సంవత్సరాలు కావస్తున్న సందర్భంగా ఆదివారం రెండో వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజామున స్వామివారి అభిషేకంతో పూజా కార్యక్రమాలను ప్రారంభించారు స్థానిక ప్రాంతాలకు చెందిన వందలాది మంది భక్తులు వార్షికోత్సవ మహా పూజ కార్యక్రమంలో పాల్గొన్నారు. పూజా కార్యక్రమం అనంతరం బస్తీ పెద్దలు, దేవాలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. అన్న దాన కార్యక్రమంలో స్థానిక ప్రాంతాలకు చెందిన వందలాది మంది పాల్గొని అన్నదానాన్ని స్వీకరించారు . బండ్లగూడ కాళీ మందిర్ ప్రాంతానికి చెందిన జై భవాని భజన మండలి శివరాం బృందం ఆలపించిన భక్తి గీతాలు విశేషంగా ఆ కట్టుకున్నాయి. భజన బండలి బృందంతో పాటు స్థానిక ప్రాంతాలకు చెందిన మహిళా భక్తులు ఈ భజన కార్యక్రమంలో పాల్గొన్నారు. రెండో వార్షికోత్సవం సందర్భంగా దేవాలయాన్ని చూడముచ్చటగా అలంకరించారు. భక్తులకు ఇబ్బంది కలగకుండా దేవాలయ కమిటీ సభ్యులు భారీ ఏర్పాట్లు చేపట్టారు.



## తీస్తా నది సమస్యపై ఇండియా కూటమి మద్దతు కోరిన మమతా బెనర్జీ

న్యూఢిల్లీ, జూన్ 20 (ప్రభాత ఉదయం): బంగ్లాదేశ్ ప్రధాని షేక్ హసీనా రెండు రోజుల క్రితం భారత పర్యటనకు వచ్చారు. ప్రధాని నరేంద్రమోడీతో పలు ఒప్పందాలు చేసుకున్నారు. తీస్తా నది నీటి నిర్వహణపై మోడీ-హసీనాలు చర్చించారు. అయితే, దీనిపై పశ్చిమబెంగాల్ సీఎం మమతా బెనర్జీ అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ విషయంలో కేంద్రం తీరును అడ్డుకునేందుకు ఇండియా కూటమి మద్దతు కోరినట్లు తెలుస్తోంది. తీస్తా నదీ జలాల విషయలో పశ్చిమ బెంగాల్‌ని చర్చల నుంచి తప్పించడంపై ఆమె ఆగ్రహంగా ఉన్నట్లు తెలుస్తోంది. త్వరలో దీనిపై ప్రధాని మంత్రికి లేఖ రాయవచ్చని సంబంధిత వర్గాలు తెలిపాయి. మోడీ, హసీనాలు తీస్తా నది పరిరక్షణ, నిర్వహణ, 1996 గంగా జల ఒప్పందాన్ని పునరుద్ధరించడంపై చర్చించారు. బంగ్లాదేశ్‌లోని తీస్తా నది పరిరక్షణ, నిర్వహణ, చర్చల కోసం సాంకేతిక బృందం త్వరలో బంగ్లాదేశ్ సందర్శిసుందని ప్రధాని నరేంద్రమోడీ మీడియా ప్రకటనలో తెలిపారు. ఈ ప్రాజెక్టు కింద తీస్తా నది నీటిని నిర్వహించడానికి, సంరక్షించడానికి భారత్ పెద్ద రిజర్వాయర్లు, సంబంధిత మౌలిక సదుపాయాలను నిర్మించాలని భావిస్తోంది. రెండు దేశాల మధ్య తీస్తా నీటి భాగస్వామ్యంపై ఒప్పందం కుదుర్చుకోవాలనే ప్రతిపాదన చాలా కాలంగా పెండింగ్‌లో ఉంది. అయితే, ఈ చర్య ఫరక్కా బ్యారేజ్ కారణంగా నేల కోతకు గురవ్వడంతో పాటు వరదలకు కారణమని ఈ ఒప్పందాన్ని చాలా కాలంగా మమతా బెనర్జీ వ్యతిరేకిస్తున్నారు. గతంలో 2011లో అప్పటి ప్రధాని మన్మోహన్ సింగ్ ఢాకా పర్యటనలో నీటి భాగస్వామ్య ఒప్పందంపై సంతకం చేయాల్సి ఉంది, కానీ ఇది బెంగాల్‌లోని ఉత్తర ప్రాతంలో నీటి కొరతకు దారి తీస్తుందని మమతా బెనర్జీ అభ్యంతరం చెప్పడంతో ఈ ఒప్పందాన్ని నిలిపేశారు.



## బెయిల్ నిలిపివేతపై.. సుప్రీం కోర్టుకు కేజ్రీవాల్

మొదటి పేజీ తరువాయి...

తెలిసిందే. దీంతో తిహాడ్ జైలునుంచి ఆయన విడుదల చివరి క్షణంలో నిలిచిపోయింది. ఈ క్రమంలోనే బెయిల్‌పై హైకోర్టు విధించిన మధ్యంతర స్టేను సవాల్ చేస్తూ కేజ్రీవాల్ తాజాగా సుప్రీం కోర్టును ఆశ్రయించారు. ఈ కేసులో కేజ్రీవాల్‌కు సాధారణ బెయిల్ మంజూరు చేస్తూ ట్రయల్ కోర్టు గురువారం తీర్పు వెలువరించింది. రూ.లక్ష వ్యక్తిగత బాండు సమర్పించాలని, విచారణకు ఆటంకం కలిగించరాదని, సాక్షుల్ని ప్రభావితం చేయకూడదని ఆంక్షలు విధించింది. ఎప్పుడు అవసరమైతే అప్పుడు కోర్టుకు హాజరై విచారణకు సహకరించాలని ఆదేశించింది. అయితే.. ట్రయల్ కోర్టు తమ వాదనలకు తగినంత సమయం ఇవ్వలేదని ఆరోపిస్తూ ఈడీ దిల్లీ హైకోర్టుకు వెళ్లింది. దీంతో కింది కోర్టు ఉత్తర్వును హైకోర్టు శుక్రవారం నిలిపివేసింది.

## రైతుని రాజు చేయాలన్నదే మా ఆశయం

మొదటి పేజీ తరువాయి...

మీ ప్రభుత్వమన్నారు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి. పేదోడి కోసం పని చేసే ప్రభుత్వ మనీ మనసుపూర్తిగా చెబుతున్నామని, ఆ ప్రభుత్వ ప్రతిపక్షాల కాకి గోలని తల తన్నేలా మీ దీవెనలతో వచ్చిన ఇందిరమ్మ ప్రభుత్వం పని చేస్తుంది అని చెబుతున్నామని ఆయన తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్టు పేరుతో 7 లక్షల కోట్ల రూపాయలు అప్పుచేసి పోయిందని, ఆ కాళేశ్వరం ప్రాజెక్టు నేడు కుంగిపోయింది కొట్టుకపోయిందన్నారు. మీకు ఇచ్చిన ఆమెని నెరవేర్చటం కోసమన్నారు. ఒకపక్క ఏడు లక్షల కోట్ల రూపాయల అప్పు కట్టాల్సి వస్తుందని, మరోపక్క పేదోడి గౌరవాన్ని కాపాడుకోవాల్సి వస్తుందని పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ఈ రెండిటిని సమతుల్యం చేస్తూ మీ రేవంత్ రెడ్డి ప్రభుత్వం పేదవాడికి న్యాయం చేస్తుందని చెబుతున్నామన్నారు.

## బీఎస్పీ ఛీఫ్ కీలక నిర్ణయం

మొదటి పేజీ తరువాయి...



జాతీయ సమన్వయకర్తగా కూడా నియమించారు. లోక్ సభ ఎన్నికల్లో బీఎస్పీ ఒక్క స్థానం కూడా గెలవలేదు. పార్టీ భవితవ్యాన్ని దృష్టిలో ఉంచుకుని మాయవాతి జూన్ 23 ఆదివారం నాడు లక్నోలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆకాశ్ ఆనంద్ సహా జాతీయ స్థాయి నేతలతో పాటు, అన్ని రాష్ట్రాలకు చెందిన బీఎస్పీ నేతలు ఈ సమావేశానికి హాజరయ్యారు. గతంలో కూడా ఆకాశ్ ఆనంద్‌ను వారసుడిగా ప్రకటించారు మాయావతి. అయితే ఎన్నికల ముందు అతడిని రెండు హోదాల నుంచి తొలగించారు. ఆత్మాభిమానం, ఆత్మగౌరవం అనే అంశాల ప్రాతిపదికగా, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆశయాల స్ఫూర్తిగా తాను, కాన్షీరామ్ కలిసి పార్టీని ఏర్పాటు చేసి, అందుకోసం తమ జీవితాలను సైతం త్యాగం చేశామని మాయావతి ఎన్నికల ముందు పేర్కొన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో దేశవ్యాప్తంగా బీఎస్పీ 424 మంది అభ్యర్థులను బరిలో దించింది. వారిలో ఒక్కరు కూడా గెలవలేదు. ఈ క్రమంలో.. రెండు హోదాల నుంచి తొలగించిన కొన్ని రోజులకే, మాయావతి తన మేనల్లుడికి అవే హోదాలను తాజాగా తిరిగి కట్టబెట్టారు. బీఎస్పీలో యూత్‌లీడర్‌గా ఆకాశ్‌కు మంచి పేరుంది. చాలా దూకుడుగా వ్యవహరిస్తారని బీఎస్పీ నేతలు చెబుతుంటారు. అందుకే మేనల్లుడినే తిరిగి నమ్ముకున్నారు బెహన్‌జీ. పార్టీ పగ్గాలను ఆకాశ్‌కు అప్పగించాలని నిర్ణయించుకున్నారు.



## నీట్‌పై సోమవారం ఉన్నత స్థాయి కమిటీ తొలి భేటీ

న్యూఢిల్లీ, జూన్ 23 (ప్రభాత ఉదయం): నీట్ పేపర్ లీక్‌పై దేశ వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళనలు జరుగుతున్న నేపథ్యంలో శనివారం కేంద్ర ప్రభుత్వం ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేసింది. ఈ ప్యానెల్ సోమవారం తొలిసారి సమావేశం అవుతున్నట్లు తెలుస్తోంది. నీట్ పేపర్ లీక్‌పై విద్యార్థి సంఘాలతో పాటు ఆయా విపక్ష పార్టీలు నిరసనలు, ధర్నాలు చేపట్టారు. కొద్ది రోజులుగా ఈ వివాదం రోజురోజుకు ముదురుతోంది. ఇంకోవైపు సోమవారం నుంచి పార్లమెంట్ సమావేశాలు ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో ఉభయసభలను ప్రతిపక్షాలు స్తంభింపజేసే అవకాశాలు ఉన్నాయన్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం అప్రమత్తమై కమిటీని నియమించింది. నీట్ పరీక్షలు సజావుగా నిర్వహించడం కోసం ఇస్రో మాజీ చీఫ్ కె రాధాకృష్ణన్ నేతృత్వంలో కమిటీని ఏర్పాటు చేసింది. ఏడుగురు సభ్యులతో కూడిన ప్యానెల్‌ను ఏర్పాటు చేసింది. రెండు నెలల్లోగా విద్యాశాఖకు నివేదిక అందజేయాలని కేంద్రం ఆదేశించింది. హెచ్‌సీయూ వీసీ, ప్రొఫెసర్.బీజేరావు, ఐఐటీ మద్రాస్ ప్రొ.రామమూర్తి, కర్మయోగి భారత్ కో ఫౌండర్ పంకజ్ బన్సల్, ఐఐటీ ఢిల్లీ డీన్ ప్రొ.ఆదిత్య మిత్తల్, కేంద్ర విద్యాశాఖ జాయింట్ సెక్రటరీ గోవింద్ జైశ్వాల్, ఢిల్లీ ఎయిమ్స్ మాజీ డైరెక్టర్ డా. రణ్‌దీప్ గులేరియా సభ్యులుగా ఉన్నారు. ప్రవేశ పరీక్షల నిర్వహణ పారదర్శకంగా, నిష్పక్షపాతంగా ఉండటం కోసం ఈ కమిటీని ఏర్పాటుచేసినట్లు కేంద్ర విద్యాశాఖ వెల్లడించింది. పరీక్షల నిర్వహణ విధానంలో సంస్కరణలు, డేటా సెక్యూరిటీ ప్రొటోకాల్స్‌లో పురోగతి, జాతీయ టెస్టింగ్ ఏజెన్సీ పనితీరుపై ఈ కమిటీ తగిన సిఫార్సులు చేయనుంది. రెండు నెలల్లోగా తన నివేదికను సమర్పిస్తుందని కేంద్రం తెలిపింది.



## అరుణాచల్‌లో "క్లౌడ్ బరస్ట్" రాష్ట్రంలో భారీ వరదలు

అరుణాచల్ ప్రదేశ్, జూన్ 23 (ప్రభాత ఉదయం): ఈశాన్య రాష్ట్ర అరుణాచల్ ప్రదేశ్ భారీ వర్షాలు, వరదలతో అతలాకుతలం అవుతోంది. "క్లౌడ్ బరస్ట్" కారణంగా ఆ రాష్ట్రంలో భారీ వర్షాలకు చాలా ప్రాంతాల్లో వరదలు పెరిగాయి. ఇటానగర్‌లో పలు ప్రాంతాలు జలమయమయ్యాయి. చాలా చోట్ల ఆస్తి నష్టం జరిగింది. వరదల కారణంగా అనేక ఇళ్లు దెబ్బతిన్నాయి. ఇదిలా ఉంటే పలు ప్రాంతాల్లో కొండచరియలు విరిగిపడ్డాయి. పరిస్థితిని అధికారులు పరిశీలిస్తున్నారు. ప్రజలకు సాయం చేసేందుకు రెస్క్యూ కార్యక్రమాలు ప్రారంభించారు. అంతకుముందు మంగళవారం కురిసిన భారీ వర్షాలకు కర్సింగ్సా ప్రాంతంలో భారీ నష్టం సంభవించింది. నిర్జులి నుంచి బాండేర్‌దేవా వరకు ఉన్న రహదారిని మూసేశారు. ముఖ్యంగా, భారీ వర్షాల కారణంగా అరుణాచల్ ప్రదేశ్ రాష్ట్రంలో అనేక చోట్ల కొండచరియలు విరిగిపడిన సంఘటనలు నమోదయ్యాయి. రాబోయే ఐదు రోజుల్లో అరుణాచల్ ప్రదేశ్‌లోని కొన్ని ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ వాతావరణ సూచనను విడుదల చేసింది. రాబోయే ఏడు రోజుల పాటు అరణాచల్ వ్యాప్తంగా చాలా చోట్ల తేలికపాటి నుంచి మోస్తారు వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు ప్రకటించింది. దాదాపుగా 20 నుంచి 30 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో గంట వ్యవధిలో 100 మిల్లీమీటర్ల కన్నా ఎక్కువ వర్షపాతం నమోదైతే దానిని 'క్లౌడ్ బరస్ట్'గా వ్యవహరిస్తుంటారు. ఒక్కసారిగా తక్కువ సమయంలోనే ఎక్కువ వర్షపాతం నమోదు కావడంతో వరదలు ఉప్పెనలా విరుచుకుపడుతాయి. ముఖ్యంగా కొండలు, హిమాలయ ప్రాంతాల్లో ఈ వర్షాలు మరింత ప్రమాదకరంగా మారుతుంటాయి.

## నేషనల్ హైవేపై ఫ్లైఓవర్ నిర్మాణం

మొదటి పేజీ తరువాయి...

45 వేల వాహనాలకు పైగా రాకపోకలు సాగుతున్నాయి. ముఖ్యంగా ఆదివారం సెలవు దినాల్లో ఈ సంఖ్య ఎక్కువగా ఉంటుంది. ప్రస్తుతం 181 కిలోమీటర్ల మేర ప్రయాణానికి నాలుగున్నర నుంచి ఐదు గంటలు పడుతోంది. ఏటా వందలాది ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఇందులో వందలాదిమంది మృత్యువాత పడుతుండగా, అనేక మంది క్షతగాత్రులుగా మిగిలిపోతున్నారు.

### ఈ హైవేపై ప్రముఖులు మృత్యువాత..

హైదరాబాద్-విజయవాడ రహదారిపై ప్రమాదాలు అధికమే. రద్దీ కారణంగానే దుర్ఘటనలు చోటుచేసుకుంటున్నాయి. దివంగత సీఎం ఎన్టీ రామారావు కుమారుడు హరిక్రిష్ణ, మనవడు జానకి రాం ఈ రహదారిపై జరిగిన ప్రమాదాల్లోనే ప్రాణాలు కోల్పోయారు. టీడీపీ నేతలు లాల్ జాన్ బాషా లాంటి ఎందరో చనిపోయారు. రాంగ్ రూట్‌లో వాహనాలు ప్రయాణించడం, డీప్ కర్వ్‌లు, ఆగి ఉన్న వాహనాలతో వరుస ప్రమాదాలతో సామాన్యుల ప్రాణాలు గాలిలో కలుస్తున్నాయి. ఈ హైవేపై గత ఏడాది 918 రోడ్డు ప్రమాదాలు జరిగ్గా, 318 మంది మృతి చెందారు. ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటివరకు 92 ప్రమాదాలు జరుగగా, 46 మంది మృతి చెందారు.



### హైవేపై 17 బ్లాక్ స్పాట్స్ గుర్తింపు..

హైదరాబాద్ విజయవాడ జాతీయ రహదారిపై ఎక్కువగా ప్రమాదాలు చోటు చేసుకునే 17 ప్రాంతాలను తెలంగాణ ప్రభుత్వం, నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా లు బ్లాక్ స్పాట్స్‌గా గుర్తించింది. ఈ హైవేపై చౌటుప్పల్, పెదకాపర్తి, చిట్యాల, కట్టంగూర్,ఇనుపాముల, టేకుమట్ల, ఎస్.వీ.కాలేజ్ జనగాం ఎక్స్ రోడ్, ఈనాడు జంక్షన్, దురాజ్ పల్లి జంక్షన్, ముకుందాపూరం, అకుపాముల, కోమరబండా ఎక్స్ రోడ్, కట్టకొమ్మ గూడెం, మేళ్లచెరువు, శ్రీరంగాపురం, రామాపురం ఎక్స్ రోడ్డు, నవాబ్ పేట్ జంక్షన్ లను బ్లాక్ స్పాట్స్ గా తెలంగాణ ప్రభుత్వం గుర్తించింది.

### రూ. 326 కోట్ల వ్యయంతో బ్లాక్ స్పాట్స్ వద్ద దిద్దుబాటు చర్యలు..

ఈ హైవేపై ఉన్న బ్లాక్ స్పాట్స్ మరమ్మతులపై మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అధికారులతో సమీక్షించారు. 17 బ్లాక్ స్పాట్స్ ప్రాంతాల్లో పనులకు రూ.326 కోట్ల వ్యయంతో ప్రాథమిక దిద్దుబాటు చర్యలను చేపట్టారు. బ్లాక్ స్పాట్స్ వద్ద సైన్ బోర్డ్స్, హెవీ స్పీడ్ నిర్మూలన, జంక్షన్ డెవలప్ మెంట్స్, వెహికిల్ అండర్ పాస్‌లు, రెండు వైపుల సర్వీస్ రోడ్ల నిర్మాణం వంటి చర్యలతో ప్రమాదాలను అరికడతామని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి చెబుతున్నారు. ఇందులో భాగంగానే.. చిట్యాల వద్ద రూ.40 కోట్ల రూపాయలతో నిర్మించనున్న ఫ్లై ఓవర్‌కు ఆయన శంకుస్థాపన చేశారు. చౌటుప్పల్‌లో రూ. 140 కోట్ల రూపాయలతో ఫ్లై ఓవర్ బ్రిడ్జిని నిర్మించనున్నారు.
తెలుగు రాష్ట్రాలకు అత్యంత కీలకమైన హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై ప్రమాదాల నివారణతో పాటు ప్రయాణికులకు ట్రాఫిక్ కష్టాలు కొంతమేర తీరనున్నాయి. 17 బ్లాక్ స్పాట్లలో చేపట్టే అండర్ పాసులు, ఫ్లై ఓవర్ బ్రిడ్జిల నిర్మాణ కాంట్రాక్ట్‌ను హరియాణాకు చెందిన రాంకుమార్ కన్‌స్ట్రక్షన్స్ దక్కించుకుంది. డిసెంబర్ నాటికి ఈ పనులన్నింటిని పూర్తి చేయాలని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి టార్గెట్‌గా నిర్ణయించారు.

# మా వీధిలో పారిశుద్ధ్య నిర్వాహణ పనులు చేపట్టరా



శ్రీ శివ సాయి కాలనీ లోని ఠాకూర్ కిషన్ సింగ్ ఇంటి పక్కన పరిస్థితి



శ్రీ శివ సాయి కాలనీ లోని ఈ రోడ్డును పట్టించుకోరా...



చెత్తను తొలగించరా...

## చెత్త, వరద నీటితో తరచు ఇబ్బందులు బుద్వేల్ శ్రీ శివ సాయి కాలనీ వాసి ఠాకూర్ కిషన్ సింగ్ ఆవేదన

బుద్వేల్, జూన్23(ప్రభాత ఉదయం) : బుద్వేల్ శ్రీ శివ సాయి కాలనీ లో పారిశుద్ధ్య నిర్వహణ పట్టదా అని కాలనీవాసులు ప్రశ్నిస్తున్నారు. రచయితనగర్ సర్కిల్ పాలిశుద్ధ్య విభాగం సిబ్బంది, అధికారులు అప్పుడప్పుడు కాలనీకి వచ్చి చూస్తే సమస్యలు తెలుస్తాయని గుర్తు చేస్తున్నారు. కాలనీకి చెందిన టాకూర్ కిషన్ సింగ్ ఇంటి పక్కన ఉన్న రోడ్డులో చెత్త వేయడం , వరద నీటితో పాటు డ్రైనేజీ నీరు నిలిచి ఉండడం వలన ఇబ్బందులు పడుతున్నారు. ఈ రోడ్డులో తుమ్మ చెట్లు ఏపుగా పెరిగి భయానక పరిస్థితులను తలపిస్తుంది. పక్కన ఉండేవారు కాగితాలను, చెత్తను మా ఇంటి వైపు పారవేస్తున్నారని ఠాకూర్ కిషన్ సింగ్ ఆరోపిస్తున్నారు. తమ ఇంటి పక్కన చెత్త వారాల తరబడి ఉంటున్న ఎత్తడం లేదని గుర్తు చేస్తున్నారు. రాజేంద్రనగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్, సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ డిప్యూటీ ఈఈ లు తమ కాలనీకి వచ్చి పరిశీలించాలని కోరుతున్నారు.

**కాలనీ లో అద్వాన్నంగా రోడ్లు :**

బుద్వేల్ నుంచి శ్రీ శివ సాయి కాలనీకి వచ్చే రోడ్లు గుంతల మయమై అద్వానంగా తయారయ్యాయి. మూల మలుపుల వద్ద రోడ్లు తవ్వడంతో ద్విచక్ర వాహనదారులు, పాదచారులు ప్రమాదాలకు గురవుతున్నారు. గుంతల మయమైన, కంకర తేలిన రోడ్లపై ప్యాచ్ వర్క్ పనులు చేపట్టాలని ఠాకూర్ కిషన్ సింగ్ కోరారు. రాజేంద్రనగర్ సర్కిల్ ఇంజినీరింగ్ విభాగం అదికారులు ఒకసారి కాలనీలో పర్యటించాలని విజ్ఞప్తి చేశారు.



ఠాకూర్ కిషన్ సింగ్



## మలేషియన్ టౌన్షిప్‌లో నూతన తూర్పు ద్వారాన్ని ప్రారంభించిన ఎంపీ ఈటెల రాజేందర్

కూకట్‌పల్లి, జూన్ 23 (ప్రభాత ఉదయం) కూకట్ పల్లి నియోజకవర్గం పరిధిలోని కేపిహెచ్బి డివిజన్ 114 మలేషియన్ టౌన్షిప్ (రేన్ ట్రీ పార్క్) నందు నూతనంగా (తూర్పు ద్వారం అర్చ్ మరియు బూమ్ బారియర్ ప్రాజెక్ట్) రెండవ గేటును కమిటీ సభ్యుల ఆహ్వానం మేరకు మల్కాజ్గిరి పార్లమెంట్ ఎంపీ ఈటల రాజేందర్, బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు ముఖ్య అతిధులుగా హాజరై ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కెపిహెచ్బి కంటెస్టెంట్ కార్పొరేటర్ ప్రీతం రెడ్డి, మలేషియన్ టౌన్షిప్ అధ్యక్షులు కాకర్ల సురేష్, ఉపాధ్యక్షులు డీ.కృష్ణ రెడ్డి , ప్రధాన కార్యదర్శి అల్లూరి సీతారామరాజు, సహాయ కార్యదర్శి సత్యనారాయణ, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# బండ్లగూడ మున్సిపల్ కార్పొరేషన్ టౌన్ ప్లానింగ్ అధికారులపై చర్యలు తీసుకోవాలి



కోర్టు ఆదేశాలముందు నిర్మాణ భవనం



ప్రస్తుతం నిర్మాణం పూర్తి చేసుకున్న భవనం

## అత్యున్నత న్యాయస్థానం ఆదేశాలను బేకాతర్ చేస్తున్న కమిషనర్: ఈదమ్మ గారి లక్ష్మారెడ్డి.

బండ్లగూడ, జూన్ 23(ప్రభాత ఉదయం) అత్యున్నత న్యాయ స్థానమైన హైకోర్టు ఆదేశించినా బండ్లగూడ జాగిర్ మున్సిపల్ కార్పొరేషన్ కమీషనర్ తో పాటు టౌన్ ప్లానింగ్ అధికారులు కోర్టు ఆర్డర్ ను పాటించడం లేదని హైదర్ షా కోర్ట్ ప్రాంతానికి చెందిన ఈదమ్మ గారి లక్ష్మారెడ్డి ఆరోపించారు. ఆదివారం ఆయన తన నివాసంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ... హైదర్ షాకోట్ సర్వే నంబర్ 42/3 లో తనకు పట్టా భూమి ఉందన్నారు.ఇందుకు సంబంధించి రెవెన్యూ శాఖ తనకు పట్టా జారి చేసిందన్నారు. తన పట్టా స్థలంలోని 1050 గజాల స్థలంలో కూన అశోక్ గౌడ్ తన స్థలం గా నిర్మాణాన్ని ప్రారంభించినట్టు తెలిపారు. దీంతో తాను 2017 జులై 20వ తేదీన అప్పటి గ్రామ పంచాయతీ అయినా హైదర్ షాకోట్ గ్రామపంచాయతీలో ఫిర్యాదు చేసినట్టు తెలిపారు. పంచాయతీ కార్యాలయంలో తన ఫిర్యాదుకు 851 వ నంబర్ అందించారని గుర్తు చేశారు. అయినా పనులను కొనసాగిస్తుండడంతో తాను 2019లో హైకోర్టును ఆశ్రయించినట్లు తెలిపారు.( డబ్ల్యుపి నంబర్ 13 715/ 2019) హైకోర్టు కు తాను పూర్తి దస్తావేజులను అందజేసినట్టు వెల్లడించారు. హైకోర్టు 2019వ సంవత్సరములో భవన నిర్మాణ పనులను ఆపివేసి ఏలాంటి పనులు నిర్వహించకుండా తగు చర్యలు చేపట్టాలని బండ్లగూడ జాగిర్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ కు ఆదేశించిందన్నారు. గత కొన్ని రోజులుగా తిరిగి పనులను నిర్వహిస్తున్నారని ఇదే విషయాన్ని తాను ప్రస్తుతం ఉన్న కమీషనర్ తో పాటు టౌన్ ప్లానింగ్ అధికారులను కలిసి ఫిర్యాదు చేసిన పట్టించుకోవడంలేదని ఆందోళన వ్యక్తం చేశారు. హైకోర్టు ఆదేశాలనే పట్టించుకోని అధికారులు సామాన్యుల ఫిర్యాదు లను పట్టించుకుంటారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇదే విషయంలో ఉన్నతాధికారులు స్పందించి వెంటనే పనులను నిలుపుదల చేయాలని కోరారు. ప్రస్తుతం జరుగుతున్న పనుల విషయమై తాను తిరిగి కోర్టుకు వెళ్తానని ఈ సందర్భంగా స్పష్టం చేశారు. న్యాయ పరంగా తాను ముందుకు వెళ్తానని అధికారులపై కఠినంగా చర్యలు తీసుకునేలా అధికారులను కోరుతానని వెల్లడించారు.



సత్య సాయి పొదుపు సంఘం పాలక వర్గ సభ్యులు

## పొదుపు జీవితంలో భాగం కావాలి

### పొదుపుతోనే ప్రతి కుటుంబం ఆర్థికాభివృద్ధి సాధ్యం సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు గద్దే యాదగిరి , సంఘం అధ్యక్షుడు పగిడిమర్రి సూర్యనారాయణ

రాజేంద్రనగర్, జూన్ 23 (ప్రభాత ఉదయం): పొదుపుతోనే ప్రతి కుటుంబం ఆర్థికాభివృద్ధి సాధ్యమని సత్యసాయి పరస్పర సహాయక సహకార పొదుపు సంఘం లిమిటెడ్ వ్యవస్థాపక అధ్యక్షుడు గద్దె యాదగిరి, అధ్యక్షుడు పగిడిమర్రి సూర్య నారాయణ లు అన్నారు. పొదుపు సంఘం నిర్వహణలో పాలక వర్గ సభ్యులు సమిష్టిగా సంఘాభివృద్ధికి కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఆదివారం మైలార్ దేవ్ పల్లి డివిజన్ లోని మార్కండేయ నగర్ లో గల సత్యసాయి పరస్పర సహాయక సహకార పొదుపు సంఘం 24వ వార్షిక సర్వ సభ్య సమావేశం సంఘం ఆవరణలో నిర్వహించారు. ఈసందర్భంగా వారు ఇరువురు మాట్లాడుతూ... 2000వ సంవత్సరంలో 20 మంది సభ్యులతో కలసి ఏర్పాటు చేసిన తమ సంఘం ప్రస్తుతం 626 మంది సభ్యులతో 4 కోట్ల 44 లక్షల టర్నోవర్తో కొనసాగుతుందన్నారు. 2023 ఏప్రిల్ 1 వ తేదీ నుంచి మార్చి 31వ తేదీ వరకు సంఘం లావా దేవిలు, ఆస్తులు అప్పులు, పసూళ్ళ చెల్లింపులకు సంబంధించిన బాధ్యతలకు సంబంధించిన వార్షిక నివేదిక చదివి సభ్యులకు వివరించారు. సభ్యులు ప్రతి నెల పొదుపు చేయడం ఎంత ముఖ్యమో వారు పొందే అప్పుల కిస్తులు వడ్డీతో చెల్లించడం అంతకంటే ముఖ్యమని గుర్తు చేశారు. సభ్యులు తమ కుటుంబ, ఆర్థిక అవసరాలకు ప్రైవేట్ వ్యక్తుల వద్ద అధిక వడ్డీకి అప్పులు చేయకుండా నూతనంగా అనేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. అప్పలు కోరే సభ్యుల ఆర్థిక అవసరాలను గుర్తించి సంఘం నిబంధనల ప్రకారం అప్పుల మంజూరీలో ఇతోధికంగా సేవలందిస్తున్నట్లు తెలిపారు. తమ సంఘం ఆధ్వర్యంలో కళ్యాణ మండపం నిర్మించాలని మహా సభ తీర్మాణం చేసిందని వెల్లడించారు.

**నూతన కార్యవర్గం :**

సత్యసాయి పొదువు సంఘం వార్షిక సభ అనంతరం పదవీకాలం ముగిసిన సభ్యులకు అడిటర్ వెంకటేష్, సలహదారుల ఆధ్వర్యంలో ఎన్నికలు నిర్వహించారు. అనంతరం పాలక వర్గ సభ్యులుగా ఎన్నికైన సభ్యులు నూతన కమిటీని ఎంపిక చేశారు. అధ్యక్షుడుగా సూర్యనారాయణను మరో మారు సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా కోటశ్యామ్ కుమార్, ఉపాధ్యక్షులుగా మునగపాటి విష్ణను ఎన్నుకోగా, సహాయ కార్యదర్శిగా కర్నాటీ శ్రీనివాస్, కోశాధికారిగా కోట పవన్ కమార్ నియమితులయ్యారు. పాలక వర్గ సభ్యులుగా విడెం రమేష్, కైరంకొండ శంకర్, శిరందాసు నరేందర్, గంజి నరేష్, కంది అశోక్, బాత్కు విజయకుమార్, బూసం భాను చందర్, గంజి ధనంజయ్ కొనసాగుతారని ఎన్నికల అధికారి, అడిటర్ వెంకటేష్ వెల్లడించారు. సలహాదారులుగా గద్దె యాదగిరి, ఏర్వ సత్యనారాయణ గద్దె కృష్ణ, పగిడిమర్రి వాసు వ్యవహరిస్తారని ఆయన తెలిపారు.



## కిస్మత్‌పూర్‌లోని ఆదరణ హెూంలో కోరని ఉదయ్ కిరణ్ జన్మదిన వేడుకలు

బుద్వేల్, జూన్23(ప్రభాత ఉదయం): కిస్మత్ పూర్ ఆదరణ అనాధ ఆశ్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు,మాజీ కౌన్సిలర్ కోరని దయానంద్ కుమారుడు కోరని ఉదయ్ కిరణ్ (టోనీ) పుట్టిన రోజు వేడుకలు ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. కోరని ఉదయ్ కిరణ్ అనాథ పిల్లలతో కలిసి కేక్ కట్ చేసి పిల్లలందరికి స్వీట్స్,పండ్లు పంపిణీ చేసారు.అనంతరం చిన్నారులతో కలిసి భోజనం చేశారు.చిన్నారుల యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా కోరని దయానంద్ మాట్లాడుతూ...అనాథ విద్యార్థుల సమక్షంలో ఆ కుమారుడి పుట్టినరోజు వేడుకలు జరుపుకోవడం సంతోషంగా ఉందన్నారు.అనాథ పిల్లల అవసరాలు తీర్చేందుకు తాను ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానన్నారు.ఈ ఆశ్రమానికి భవిష్యత్తులోనూ తన వంతు సహకారం అందిస్తామని పేర్కొన్నారు.

# అర్హులైన పేద లందరికి ఇండ్ల స్థలాలు ఇవ్వాలి



మాట్లాడుతున్న నీరటి మల్లేష్



పాల్గొన్న కార్యకర్తలు

బుద్వేల్, జూన్ 23 (ప్రభాత ఉదయం): రాజేంద్రనగర్ నియోజకవర్గం పరిధిలోని రాజేంద్రనగర్, గండిపేట్, శంషాబాద్ మండలాల్లో ఇళ్ల స్థలాలు, ఇండ్లు లేని పేదలందరిని గుర్తించి వారికి స్థలాలు కేటాయించాలని సీపీఎం రంగారెడ్డి జిల్లా కమిటీ సభ్యుడు నీరటి మల్లేష్ ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం కాటేదాన్ లో సీపీఎం పార్టీ రాజేంద్రనగర్ నియోజకవర్గం సమావేశం జరిగింది. నీరటి మల్లేష్ సీపీఎం పార్టీ రాజేంద్రనగర్ మండల కార్యదర్శి జి కురుమయ్య, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు జి. విక్రమ్ కుమార్ పాల్గొని మాట్లాడుతూ కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇల్లు లేని పేదలను దృష్టిలో ఉంచుకొని వెంటనే స్పందించి ఎక్కడికక్కడ పేదలను గుర్తించి ఇంటి స్థలము ఇండ్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. స్వాతంత్రం వచ్చి 77 సంవత్సరాలు గడుస్తున్న పేదలు పేదలుగానే ఉన్నారని అన్నారు . కనీసం ఇప్పుడైనా అర్హులైన పేదలందరికీ ఇల్లు నిర్మించి ఇల్లు స్థలం లేని వారికి స్థలాన్ని కేటాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఈ పవన్ కుమార్, స్వామి, రామ్మోహన్, జంగయ్య, మోహన్ , అనురాధ , సువార్త, జయమ్మ , గణేష్, లావణ్య, గట్టయ్య , తదితరులు పాల్గొన్నారు

# ఘనంగా శ్యాం ప్రసాద్ ముఖర్జీ వర్ధంతి వేడుకలు

## దేశంలో ద్వంద్వ నీతికి చెక్ పెట్టిన మహనీయుడు శ్యాం ప్రసాద్ ముఖర్జీ

## 370 ఆర్టికల్ రద్దుకు పోరాడిన వ్యక్తి శ్యాం ప్రసాద్ ముఖర్జీ

## శేరిలింగంపల్లి అసెంబ్లీ ఇంఛార్జి రవికుమార్ యాదవ్

కూకట్‌పల్లి, జూన్ 23 (ప్రభాత ఉదయం) శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ వర్ధంతి (ఆత్మబలిదాన్ దివస్) సందర్భంగా కూకట్ పల్లి డివిజన్ డివిజన్ పాపిరెడ్డి నగర్ బస్తీదావఖన చౌరస్తా వద్ద ఏర్పాటు చేసిన వారి చిత్రపటానికి పూలమాలలు వేసి ఆయన పేరు మీద రోడ్లకు విలువైపున మొక్కలు నాటి ఆయన చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించారు. కొంతమంది యువకులు భారతీయ జనతా పార్టీకి ఆకర్షితులైన రవి కుమార్ యాదవ్ సమక్షంలో బిజెపి లో చేరారు. ఈ సందర్భంగా రవికుమార్ యాదవ్ మాట్లాడుతూ అఖండ భారతావనిలో ఒకే జెండా, ఒకే రాజ్యాంగం, ఒకే నినాదం ఉండాలని గట్టిగా చెప్పిన గొప్ప మహనీయుడు శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ అని తెలిపారు. జాతీయ సమగ్రత, దేశ ప్రజల ఐక్యతను దెబ్బతీసే నాటి నెహ్రూ విధానాలను తీవ్రంగా శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ వ్యతిరేకించారని గుర్తు చేశారు. ప్రత్యేక సంస్థానంగా ఉన్న జమ్మూ కాశ్మీర్ వెళ్లాలంటే నాడు పర్మిషన్, 370 ఆర్టికల్ విధానాన్ని వ్యతిరేకించి రద్దు అయ్యేందుకు పోరాడి అక్కడే శ్యామ్ జీ ఆత్మబలిదానమైయ్యారని గుర్తు చేశారు. ఆయన ప్రాణత్యాగం వృధాకాకుండా దేశ ప్రజల అభీష్టం మేరకు ప్రధాని నరేంద్రమోడీ 370 ఆర్టికల్ రద్దు చేశారని కొనియాడారు. దేశం మొత్తం ఒక్కటే భారత రాజ్యాంగం అమలు చేస్తున్న ఘనత బీజేపీ ప్రభుత్వానికే దక్కుతుందని అన్నారు . ఈ కార్యక్రమంలో నియోజకవర్గ కోకన్వీనర్ మని భూషణ్, రామరాజు, డివిజన్ అధ్యక్షుడు భూపాల్ రెడ్డి, నరేందర్ రెడ్డి, నర్సింగ్ రావు, రాజిరెడ్డి, నర్సింగ్ యాదవ్, కేశవ్ ,పర్వతాలు యాదవ్, నరసింహ చారి, బాలు యాదవ్, శ్రీకాంత్, నరేష్, రఘునాథ్, ఇంద్రసేనారెడ్డి, సిద్దయ్య, సాయి, విజయ్, రవి కుమార్, నరసింహ, గణేష్ ,రామ్ రెడ్డి శ్రీనివాసులు, రఘు, హరీష్ యాదవ్, స్రవంతి, కవిత, సంధ్య, అరుణ లోకేష్, కామరాజు తదితరులు పాల్గొన్నారు.






# రైతు సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం

### కాంగ్రెస్ జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షులు వేముల శ్రీనివాస్ రెడ్డి

కొత్తకోట, జూన్ 23(ప్రభాత ఉదయం) రైతు సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం అని కాంగ్రెస్ వనపర్తి జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షులు వేముల శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ఆదివారం కొత్తకోట పట్టణ కేంద్రంలో సీఎం రేవంత్ రెడ్డి రైతులకు ఎన్ని క్రమము ఇచ్చినా రెండు లక్షల రుణమాఫీ ప్రకటించటం పట్ల ముఖ్యమంత్రి ఏనుమల రేవంత్ రెడ్డి, దేవరకద్ర నియోజకవర్గ శాసనసభ్యులు జి మధుసూదన్ రెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకం చేసి కాంగ్రెస్ పార్టీ నాయకులు సంబరాలు జరుపుకున్నారు. కొత్తకోట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నాగారపు బీచ్ పల్లి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో కొత్తకోట పట్టణ అధ్యక్షులు మేస్త్రి శ్రీను, రాష్ట్ర ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు పల్లెపాగు ప్రశాంత్, మాజీ జెడ్పీటిసి సభ్యులు పీజే.బాబు మాట్లాడుతూ... రైతులకు ఇచ్చిన మాట ప్రకారం రెండు లక్షల రుణమాఫీ గురించి తెలిపారు.అసెంబ్లీ ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు రెండు లక్షల రైతు రుణమాఫీకి మంత్రివర్గం రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆమోదం తెలపటం సంతోషకరమన్నారు. వరంగల్ డిక్లరేషన్ లో జాతీయ కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ ఇచ్చిన మొదటి హామీ 2 లక్షల రైతులు రుణమాఫీని కాంగ్రెస్ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయడం హర్షనీయమన్నారు. కాంగ్రెస్ రైతుల పక్షాన ఎల్లప్పుడూ ఉంటుందని రైతులకు ఎప్పుడు ప్రాధాన్యత ఇవ్వడమే జరుగుతుందని ఏకకాలంలో రైతు రుణమాఫీ చేయడం పంటల బీమా పథకాన్ని తీసుకురావడం రైతు కు భరోసా పెంచడం ప్రతి విషయంలో రైతు అభివృద్ధి కోసం పాటుపడుతున్న రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర రైతన్నకి కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఎప్పటికీ అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో వనపర్తి జిల్లా కార్యదర్శులు ఎన్ జే బోయజ్, పాపయ్య గారి కృష్ణారెడ్డి, ఆమడబాకుల సత్య రెడ్డి, రామకృష్ణాపురం మూలమల్ల చంద్రశేఖర్ రెడ్డి, చర్లపల్లి శేఖర్ రెడ్డి, మండల ఉపాధ్యక్షులు సలీం ఖాన్, ఎల్లంపల్లి నరేందర్ రెడ్డి, కొత్తకోట మున్సిపల్ 13వ వార్డు కౌన్సిలర్ రామ్మోహన్ రెడ్డి, కొత్తకోట మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు జె యం మిషేక్, రాష్ట్ర ఫిషర్ మ్యాన్ కార్యదర్శి సంద వెంకటేష్, కొత్తకోట మండల ప్రచార కార్యదర్శి పి. మోహన్ రెడ్డి , కొత్తకోట పట్టణ కార్యదర్శి రవీందర్ రెడ్డి, జె సి బి రాము, బి సి సెల్ పట్టణ అధ్యక్షులు కరాటే శీను, మాజీ డైరెక్టర్ పి నరేందర్ సాగర్, డబ్బు లక్ష్మన్న,కదిరి సాయిల్ యాదవ్, ముంత సాయిలు యాదవ్, జి సాయిరాం యాదవ్, ,పి శ్రీనివాస్ రెడ్డి, జె సుభాష్, ఎం. భాస్కర్, నా ఢిల్లీ వహీద్ , లక్ష్మయ్య బాబాయ్, గంగు రంగారెడ్డి, శివ కుమార్ రెడ్డి, జె జాన్, రాము, రాఘవేంద్ర గౌడ్, కదిరి మహేష్, సిరాజ్ భాయ్, పెంటన్న యాదవ్, సాయిలు యాదవ్, విశ్వనాథం, కానయపల్లి గోకరన్న, సిమ్మి యాసోన్, సైకిల్ షాప్ జబ్బార్, టైలర్ గఫార్, సిరాజ్ బాయ్,, వి శ్యాం కుమార్, సజాద్ అలీ, ఎండి ముజీబ్, ఎండి తయాబ్, కొత్తకోట పట్టణ సహాయ కార్యదర్శి మతిన్, అజ్జు, అలీమ్, మహేష్, భాస్కర్, కొత్తకోట పట్టణ మైనార్టీ అధ్యక్షులు ఇజాజ్ అలి,బాబు,కర్ణ కుమార్, జి రాములు, రాముడు,కృష్ణయ్య, మధ్యమొని అంజన్న యాదవ్, కదిరే మహేష్, , రవి, అంజి, సాయికుమార్,డి శ్రీకాంత్, ముద్దు నవీన్ రెడ్డి, మహేశ్వర్ రెడ్డి, కురుపయ్య, శ్రీనివాసులు, కార్తీక్,సోషల్ మీడియా కన్వీనర్ నవీన్ కుమార్, తదితరులు పాల్గొన్నరు



భారతదేశంలో ఒకే జెండా, ఒకే రాజ్యాంగమనే

# నినాదాన్ని గట్టిగా చాటిన వ్యక్తి శ్యాం ప్రసాద్ ముఖర్జీ

### ఆర్టికల్ 370 విధానాన్ని వ్యతిరేకించిన వ్యక్తి శ్యాం ప్రసాద్ ముఖర్జీ

### శ్యామ ప్రసాద్ ముఖర్జీ ఆశయాల కనుగుణంగా నడుస్తున్న మోడీ

కూకట్‌పల్లి, జూన్ 23 (ప్రభాత ఉదయం) భారతదేశంలో ఒకే జెండా, ఒకే రాజ్యాంగం అనే నినాదాన్ని గట్టిగా చాటి చెప్పిన వ్యక్తి శ్యాం ప్రసాద్ ముఖర్జీ అని బీజేవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షులు కుమార్ యాదవ్ అన్నారు. భారతీయ జనతా పార్టీ (జనసంఘ్) వ్యవస్థాపకులు డాక్టర్ శ్యామ ప్రసాద్ ముఖర్జీ బలిదాన్ దివాస్ ( వర్ధంతి ) సందర్భంగా ఆల్విన్ కాలనీ డివిజన్ లాస్ట్ బస్ స్టాప్ దగ్గర బిజెపి డివిజన్ కార్యదర్శి తిరునగారి శ్రీనివాస్, బీజేవైఎం జిల్లా అధికార ప్రతినిధి శివాజీల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన బలిదాన్ దివాస్ కార్యక్రమంలో స్థానిక బిజెపి నాయకులతో కలిసి బీజేవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షులు కుమార్ యాదవ్ హాజరై శ్యామ ప్రసాద్ చిత్రపటానికి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా కుమార్ యాదవ్ మాట్లాడుతూ అక్టోబరు 21, 1951న ఢిల్లీలో శ్యాంప్రసాద్ ముఖర్జీ భారతీయ జనసంఘ్ పార్టీ స్థాపించాడని, ఆ పార్టీ సంస్థాపక అధ్యక్షుడిగా ముఖర్జీ వ్యవహరించాడు అన్నారు. నెహ్రూ సోషలిజానికి భిన్నంగా జనసంఘ్ పార్టీ స్వేచ్ఛా మార్కెట్ విధానానికి మద్దతు పలికింది అన్నారు. కాశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తి కల్పించే భారత జాతీయ కాంగ్రెసు విధానాన్ని ముఖర్జీ వ్యతిరేకించాడు అన్నారు. భారత ప్రధాని నరేంద్ర మోడీ అయన ఆశయాసాధనలో భాగమైన ఆర్టికల్ 370 ని రద్దుచేసి కాశ్మీర్ సమస్యకు పరిష్కారం చూపి ముఖర్జీ ఆశయాలకు అనుగుణంగా నరేంద్ర మోడీ నడుస్తూ భారతదేశాన్ని గొప్ప స్థానంలో నిలబెడుతున్నారు అన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రవీందర్రావు, నరేందర్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు రామరాజు, అసెంబ్లీ జాయింట్ కన్వీనర్ మన భూషణ్, జిల్లా కార్యదర్శి స్రవంతి, కేశవరావు,డివిజన్ అధ్యక్షులు కమలాకర్ రెడ్డి, బిజెపి నాయకులు రవీందర్ రెడ్డి, రాంరెడ్డి,శ్రీనివాస్ రెడ్డి, రమేష్, శైలేష్ తదితరులు పాల్గొన్నారు.



డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ బలిదాన్ దివస్ సందర్భంగా హైద ర్ గూడ లో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తున్న కార్పొరేటర్ ఎం. సంగీత గౌరీశంకర్

# రాజేంద్రనగర్ సర్కిల్‌లో శ్యామా ప్రసాద్ ముఖర్జీ బలిదాన్ దివస్

బుద్వేల్, జూన్23(ప్రభాత ఉదయం): జనసంఘ్ వ్యవస్థాపకులు శ్యామా ప్రసాద్ ముఖర్జీ బలిదాన్ దివస్ సందర్భంగా ఆదివారం ఉదయం రాజేంద్ర డివిజన్ బుద్వేల్ బస్తీ లో బీజేపీ నాయకులు మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో పార్టీ రంగారెడ్డి జిల్లా కార్యవర్గ సభ్యులు మూల శ్రీనివాస్ గౌడ్ , ఓబీసీ మోర్చా డివిజన్ అధ్యక్షులు మల్లేష్ చారి, బీజేవై అధ్యక్షులు రాకేష్ గౌడ్, మహిళా మోర్చా నాయకురాలు పద్మ, సప్న, గిరిజన అధ్యక్షుడు ప్రకాష్ నాయక్, నాయకులు గోపాల్, సందీప్, వెంకటేష్ , పాల్గొన్నారు.

### అత్తాపూర్ డివిజన్ లో....

అత్తాపూర్ డివిజన్ పరిధిలోని హైదర్ గూడ లో డాక్టర్ శ్యామ ప్రసాద్ ముఖర్జీ బలిదాన్ దివస్ సందర్భంగా ఆయన చిత్ర పటానికి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమములో డివిజన్ కార్పొరేటర్ మొండ్ర సంగీత గౌరీశంకర్, జిల్లా కార్యదర్శి మొండ్ర కొమరయ్య , అసెంబ్లీ కన్వీనర్ మల్లేష్ యాదవ్, కాడేం సుధాకర్ , మొండ్ర నరసింహ , శబాధ విజయ్, సులిగే వెంకటేష్ , నల్లింగ్ రమేష్ , జయనంద్ రెడ్డి, రావుల జగన్, కాకుళారం కృష్ణ , బాలకృష్ణ, శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.



బుద్వేల్‌లో మొక్కలు నాటుతున్న మూల శ్రీనివాస్ గౌడ్ తదితరులు



కరాటే ప్రతిభ చాటిన చిన్నారులు

# కరాటే కలర్ బెల్ట్ గ్రేడింగ్ టెస్ట్‌లో ప్రతిభ చూపిన కొత్తకోట విద్యార్థులు

### విద్యార్థులను అభినందించిన కరాటే పేరెంట్స్

కొత్తకోట, జూన్ 23(ప్రభాత ఉదయం) కరాటే లో విద్యార్థులు చక్కటి ప్రతిభ కనబరిచి బెల్ట్ సర్టిఫికెట్లు సాధించారని క్లబ్ ఫౌండర్ అబ్దుల్ నబీ తెలిపారు. కొత్తకోట పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాల ఆధ్వర్యంలో గాడ్స్ ఆన్ వారియర్స్ చోటు ఖాన్ కరాటే దు ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన బ్లాక్ బెల్ట్ , కలర్ బెల్టు గ్రేడింగ్ టెస్ట్ జరిగింది . ఈ బెల్ట్ గ్రేడింగ్ టెస్టులో కలర్ బెల్ట్ 16 విద్యార్థి విద్యార్థులు పాల్గొన్నారు. వీరిలో ఎల్లో బెల్ట్ సాధించిన వసుంధర, ది మహేంద్ర ,జీ జాస్మిత , కే బృందా , వి విహాన్, జై పవన్ కుమార్ , ఎస్ పౌల్సన్ ,పూర్ణ ప్రసాద్, ఎస్ డేవిడ్, ఆరెంజ్ బెల్ట్ కే వైష్ణవి , గ్రీన్ బెల్ట్ కే రోహిణి కే అక్షయ కే కార్తీక్ బ్లూ బెల్ట్ సిహెచ్ అభినవ్ మెరున్ బెల్ట్ శ్రీజ ఏ అభిజిత్ బ్లాక్ బెల్ట్ సాధించారు .ఈ విద్యార్థులందరినీ కరాటే పేరెంట్స్ కమిటీ సభ్యులు పాల్గొని విద్యార్థులకు బెల్టు సర్టిఫికెట్ల అందిస్తూ విద్యార్థులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ మెగా కార్యక్రమంలో క్లబ్బు డిప్యూటీ ఫౌండర్స్ జి హరీష్ యాదవ్, జాఫర్, సాదిక్ బాబా, అజ్మీర్ , కార్తికేయ యాదవ్, సురేందర్ ,అరవింద్ ,ఏ కంబరి హర్షవర్ధన్ ,పవన్ తేజ్ యాదవ్, ఎస్ కె గౌస్ పాషా పాల్గొన్నారు.



# పాపిరెడ్డి నగర్ రెడ్డి సంక్షేమ సంఘం నూతన అధ్యక్షుడుగా దొడ్ల రామిరెడ్డి ఏకగ్రీవంగా నియామకం

కూకట్‌పల్లి, జూన్ 23 (ప్రభాత ఉదయం) శేరిలింగంపల్లి నియోజకవర్గం, కూకట్ పల్లి డివిజన్ పరిధిలో పాపిరెడ్డి నగర్ రెడ్డి సంక్షేమ సంఘం సర్వసభ్య సమావేశంలో డివిజన్ పరిధిలోని స్థానిక రెడ్డి సోదరులు ఏకగ్రీవంగా అదే ప్రాంతానికి చెందిన దొడ్ల రామ్ రెడ్డిని అధ్యక్షులుగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా రెడ్డి సంక్షేమ సంఘం సోదరులు దొడ్ల రామిరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ మేరకు డివిజన్ పరిధిలో ఎవరికి ఏ సమస్య తలెత్తినా తన వంతు కృషి చేస్తానని, అదేవిధంగా సంక్షేమ సంఘంలో సభ్యులందరికీ అధికారులు, ప్రజా ప్రతినిధులు సహకరం అందించి సంఘం అందరి సహకాంతో అన్ని విధాల అభివృద్ధి చేసుకుందామని హామీ ఇచ్చారు. సంక్షేమ సంఘం ఎన్నికలలో రామిరెడ్డి గెలుపొందడం అభినందనీయమని అన్నారు. పాపి రెడ్డి నగర్ కన్టెస్టెంట్ అధ్యక్షుడు చిట్టి రెడ్డి శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ రెడ్డి సంక్షేమ సంఘం ప్రతి కాలనీకి, అన్ని సంఘాలకు ఆదర్శంగా నిలవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో రెడ్డి సంక్షేమ సంఘం సభ్యులు పెద్ద సంఖ్య లో పాల్గొన్నారు.

# గద్వాల జిల్లా పోలీసులకు సేవా పథకాలు

గద్వాల జిల్లా ప్రతినిధి, జూన్ 23(ప్రభాత ఉదయం) గద్వాల జిల్లా ఏడుగురికి పోలీసులకు 2024 ఏడాది సేవా పథకాలు లభించాయి. పోలీస్ శాఖలోని వివిధ పోలీస్ విభాగాల విధులలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి గౌరవ డిజిపి సేవా పతకాలకు ఎంపికయ్యారు. జోగులాంబ గద్వాల్ జిల్లా నుండి సేవ పతకాలకు ఏ ఎస్ ఐ జి. ఈశ్వరయ్య( మల్దకల్), ఏ ఆర్ ఎస్ ఐ ఎస్. రాజశేఖర్ ( సాయుధ దళ కార్యాలయం), హెడ్ కానిస్టేబుల్ పి. వేంకటేశ్వర్లు( ఆలంపూర్),హెడ్ కానిస్టేబుల్ రామి రెడ్డి ( మనోపాడ్), హెడ్ కానిస్టేబుల్ ప్రభాకర్ (స్పెషల్ బ్రాంచ్), వై. ఎల్లశివ చారి( సాయుధ దళ కార్యాలయం), హెడ్ హెడ్ కానిస్టేబుల్ బి.శ్రీనివాసులు (సీసీఎస్)లు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ తోట శ్రీనివాస రావు జిల్లా నుండి సేవ పతకాలకు ఎంపికైన పోలీస్ అధికారులకు అభినందనలు తెలియజేశారు.









Printed and Published **MEKALA DAMODAR REDDY** on behalf of DBC Publications, and Printed at Vanitha Graphics, H.No. 3-3-76/123/21, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy, Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: KOTLA CHANDRA KANTH. “RNI. Title- Code: TELTEL12231**. Cell: 9705231654.